# పెళ్లి ప్రయాణం

అక్కడేం చేస్తున్నావు జయం, ఎల్లుండి ప్రయాణం పెట్టుకొని తీరుబాటుగా ఏమిటా బాతాఖానీ"—పెళ్లిపనులతో సతమతమవుతూ మధ్యనొక్కసారి ఇంట్లో అందర్నీ జాడిస్తూ ఉంది తల్లి. అమ్మ సణుగుడు అలవాటుగానూ, చీవాట్లు పరిపాటిగానూ భావించి జయం ఇంకా బాతాఖానీ మానలేదు.

లక్ష్మితో మాట్లాడుతూ కూర్చుంటే గంటలూ రోజులూ సంవత్సరాలూ, నిమిషాల్లా గడిపేయవచ్చు. ఆ అధ్వాన్నపు అడివిలో లక్ష్మి లేకపోతే తనకేంతోస్తుంది. జయం ఆ ఊరు వచ్చిన దగ్గర్నుంచీ ఇద్దరికీ బాగా నేవుంది.

ఆ ఊళ్ళో రైతులూ కార్మికులూ కాక బుగతలకుటుంబాలు అయిదారు కొంపలున్నాయి. తాతలనాటినుంచీ-వేరైపోయినా వారంతా అన్నదమ్ములే. ఒకసోదరుడు ఉద్యోగంమీద దేశమంతా తిరిగితిరిగి మళ్ళా స్వగ్రామం చేరుకున్నాడు. అంతకుముందుకూడా ఏడాదికొకసారైనా కుటుంబంతో వచ్చేవాడాయన. ఆయన కుమార్తె జయం. ఊళ్లోనే పుట్టుపడిన మరొక సోదరుడి కుమార్తె లక్ష్మి.

## కన్నసామి

ఆ యిద్దరి స్నేహం ఇదివరకు ఏడాదికొకసారి చిగిరిస్తూ ఉండేది. జయం తండ్రిగారు గ్రామంలో స్థిరనివాసం ఏర్పరచుకోవడంతో స్నేహంకూడా స్థిరమైంది. ఒకరిని ఒకరు ఒకగంటయినా విడిచిఉండలేరు.

ప్రస్తుతం ఎడబాయని ఎలబ్రాయపు ఆ జంటకు ఒక తక్షణ సమస్య చర్చనీయమై కూర్చుంది. ఆ సమస్యను పరిష్కరించకపోతే వారంరోజులు ఎడబాటు తప్పదు. దుర్భరం!

జయం అన్నయ్యకు ఒకదూరపు సంబంధం చేస్తున్నారు. ఎల్లుండి అంతా తరలి వెళ్తున్నారు. ఊళ్లో ఒక్కొక్క అన్నదమ్ముడి ఇంట్లో ఇద్దరేసి మెంబర్లయినా కదలి రావాలని తీర్మానించబడింది. ఈ సందర్భంలో లక్ష్మిని ఎలాగైనా ఆ దూరదేశం తీసుకువెళ్ళడానికి జయం నిశ్చయించుకొంది. పెళ్లిపెద్దలలో ఒకడుగా లక్ష్మి అన్నయ్య వస్తాడు. అయితే ఈ గాథకి ఆనకట్టఅయి కూర్చున్నారు తండ్రిగారు. ఆయన స్వయంగా ఎలాగా ఎక్కడికీ కదలరు. లక్ష్మిని తీసుకువెళ్తామని జయం చెబితే ఆయన ససేమిరా వల్లకాదన్నారు: జయం వాళ్ళ



శివుడు: పార్వతి —ఫొటో: కమ్రుద్దీన్ ఖాన్]

# ★ పెళ్లిప్రయాణం ★

నాన్నగారితో ప్రత్యేకంగా చెప్పమని చెప్పింది. ఆయనకూడా వ్రతం చెడ్డారు కాని ఫలందక్కలేదు. చెప్పవలసిన తక్కిన వాళ్ళుకూడా సందర్భంవచ్చినప్పుడు నొక్కి వక్కాణిస్తూనే వున్నారు. ఆ ముసలాయన పట్టు విడువలేదు. "ఈడొచ్చిన పిల్లని ఎక్కడికి పంపుతామయ్యా" ఇదేవరస!

పెళ్లివారు ఒక్కొక్కరే బండి ఎక్కుతున్నారు. జయం ముఖం ముకుళించుకుని కూర్చుంది. దిగులుగా వెనక్కి చూస్తూనే బండి ఎక్కింది. కిలకిలా నవ్వుకుంటూ తనూ లక్ష్మి ప్రయాణమౌతామని మొదట ఎంతగానో మురిసిపోయింది. ఆ అయిదు మైళ్ళ రెండుగంటల కుదుపు ప్రయాణాన్ని రెండు నిమిషాల్లా గడపగలమని మురిసిపోయింది.

కిటికీలోంచి అందరి ప్రయాణాన్ని చూచి లక్ష్మికి దుఃఖం పొంగివచ్చి ఇంట్లోకి వెళ్ళిపోయింది. అన్నయ్యకి-లక్ష్మికి జయానికీ ఉండే అవినాభావమైన స్నేహం తెలుసు. కాని...పెళ్ళివారు ఊరు విడిచి పొలిమేర దాటేవరకూ ముసలాయన పట్టు విడువలేదు. అలాగే ఆ పట్టు పెళ్ళివారు పొలిమేర దాటిపోయినా లక్ష్మి విడువలేదు.

"లక్ష్మి మాత్రం ఏమంత అసందర్భమైన కోరిక కోరింది నాన్నా? మేమిందరం అన్నలం, అక్కచెల్లెళ్లూ ఉండగా మీ కెందుకా బెంగ?"—అన్నయ్య ఈ మాత్రం మాట సహాయం చేస్తాడనుకోలేదు. ముసలాయ సమాధానం కూడా లేదు. అన్నయ్యకేదో ఆలోచన తట్టినట్టు ఉంది. తండ్రికి దగ్గరగా చెవిలో మెల్లగా చెప్పాడు.

లక్ష్మి చూస్తుండగానే నాన్నగారు ఇట్టే మారిపోయారు. "సరే! అయితే తీసుకు వెళ్లు" అన్నారు. లక్ష్మి మొదట కొంచం ఆశ్చర్యపడిపోయి, అన్నయ్యలో ఏమీ ఆశ్చర్యం కనిపించనందుకు తరవాత మరికొంత ఆశ్చర్యపడి పోయింది. అప్పుడేమీ ప్రశ్నలు వెయ్యకుండా బుద్ధిగా బయలుదేరింది. "వాళ్ళు ముందు వెళ్ళిపోయారు కదూ?" అని మాత్రం అన్నది. "ఏముందమ్మా! వాళ్ళు ఈ నాటుబళ్ళమీద స్టేషనుకి చేరేటప్పటికి మనమే ముందుంటాం" అన్నాడన్నయ్య.

* * *

"జయం మనదేనే జయం!" అన్నది రైలెక్కుతూనే లక్ష్మి. లక్ష్మిని కౌగలించుకొని జయం ప్రశ్నలవర్షం కురిపించింది. 'అసలు నాన్నగారెలా ఒప్పుకున్నారు'-ముఖ్యమైన ప్రశ్న. జరిగినదంతా చెప్పింది లక్ష్మి. అన్నయ్య ఎంతచెప్పినా ఒప్పుకోలేదు. చివరికి..' అంతవరకూ చెప్పాక అన్నయ్య వైపు తిరిగి నాన్న చెవిలో ఏమిటి చెప్పావు అన్నయ్యా అంటూ మళ్ళీ జయంతో "ఆ ఒక్క మాటతో నాన్న సరేమని ఒప్పుకున్నాడు జయం" అన్నది. జయంకూడా వినాలని ఆతృత చూపించింది. అన్నయ్య "ఎందుకులే చెప్పడం" అన్నాడు.

ఇద్దరూ చెప్పమని వేధించడం ఆరంభించారు. అన్నయ్య జయాన్ని చూస్తూ "నువ్వెందుకు బయలుదేరావు జయం" అన్నాడు. "అదేం టన్నయ్యా! నాస్వంత అన్నయ్య పెళ్ళికి వస్తున్నాను." అన్నది జయం. అన్నయ్య నవ్వుతూ జయం మొహంలోకి పరీక్షగా చూసి "అది తెలుసులే! వట్టి అంతేనా...అని" అన్నాడు. జయం బుగ్గలు ఎఱ్ఱబడ్డాయి. లక్ష్మికి అర్థమై "ఓహో" అంది.

"నీ రిజర్వుడు బావని-ఎన్నాళ్ళయిందో ఓసారి చూదామని! అలాటి పనే మన లక్ష్మిదిని" జయం ఏమిటి అన్నట్టు తల ఎత్తింది. లక్ష్మి ఏమిటో అన్నట్టు బెదురుతూ చూసింది.

"ఈ ప్రయాణ సందర్భంగానే ఈమధ్యను అనుకున్న ఒక సంబంధాన్ని సెటిల్ చేదామని, పిల్లను చూడడమే తరువాయి. అన్నీ ఇంతకుముందే అనుకున్నాం. ఆ మాటే, లక్ష్మీ! నాన్నతో అన్నాను" అన్నాడు అన్నయ్య.

జయం, లక్ష్మి ముఖాలు చూసుకొని ఫక్కున నవ్వుకున్నారు.

"ఇద్దరం ఒక్కటే" అన్నది జయం. ★

